క్లుప్తంగా

రోడ్డుకు మరమ్మతులు



చినకొండేపూడిలో రోడ్డుపై గుంతలను పూడ్చుతున్న సిబ్బంది

సీతానగరం: చినకొండేపూడిలో ఆర్అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. సీతానగరం బస్టాండ్ సెంటర్ అమ్మన్న కాంప్లెక్స్ నుంచి చినకొండేపూడి శివారు వరకూ ఆర్అండ్‌బీ రోడ్డుపై గోతులు పడి వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ కిలోమీటరు పొడవున తారు రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరయ్యారు. రోడ్డుపై పడిన గోతుల్లో కంకర వేసి ఆపై తారు వేసి మరమ్మతులు చేస్తున్నారు. చినకొండేపూడి శివారు ఆంజనేయస్వామి ఆలయం వరకూ తారు రోడ్డుపై పడిన గోతులను పూడ్చుతున్నారు.

సహస్ర దీపాలంకరణ



పందలపాకలో లింగాకారంలో దీపాలంకరణ

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని శ్రీ గౌరీశంకర ఆలయం వద్ద సోమవారం రాత్రి సహస్ర దీపాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్తికమాసం పురస్కరించుకుని అర్చకులు గరిమెళ్ల గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లింగాకారం, ఓంకారం, స్వస్తిక్ ఆకారాల్లో భక్తులు దీపాలు వెలగించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



బిక్కవోలులో కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. కార్తికమాసం మంగళవారం ఏకాదశి సందర్భంగా భక్తులు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. గోలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్నసమారధన నిర్వహించారు. ఆలయ ఈవో భాస్కర్, సిబ్బంది ప్రసాద్, సత్తి బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు నేడు అంతరాయం

రంగంపేట: మండలంలోని ఎస్టీ రాజాపురం గ్రామ పరిధిలో బుధవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రాజమహేంద్రవరం రూరల్ విద్యుత్తు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు దాట్ల శ్రీధర్‌వర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్టీరాజాపురం గ్రామం వద్ద రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్న కారణంగా 27వ తేదీ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గోవిందరాజాపురం, వెంకన్నపేట, ఎస్టీరాజాపురం తదితర గ్రామాలకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

నేడు గౌరీదేవి జాతర



పెదపూడిలో కొలువైన గౌరీదేవి, సాంబశివుడు

పెదపూడి: సంతానం లేనివారికి సంతానం ప్రసాదించే అమ్మవారిగా ప్రసిద్ధి చెందిన పెదపూడి గౌరీదేవి సాంబశివుడు జాతర మహోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. గ్రామంలో నిత్యం భక్తులతో పూజలందుకుంటున్న గౌరీదేవి అమ్మవారిని కొన్నేళ్ల క్రితం పద్మశాలి కులస్తులు ప్రతిష్ఠించారు. జాతర రోజు బుధవారం రాత్రి గౌరిదేవి సాంబశివుడిని గ్రామంలో ఊరేగిస్తారు. సంతానం లేని స్త్రీలు ఈ ఉత్సవ మూర్తులను నెత్తిపై పెట్టుకుని మోయడంతో వారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ జాతర మహోత్సవానికి పెదపూడితో పాటు దోమాడ, కరకుదురు, ఏపీత్రయం, కైకవోలు, పెద్దాడ తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. శక్తి వేషాలు, బాణాసంచా ఉత్సవంలో ప్రత్యేక అకర్షణగా నిలుస్తాయి.

రబీకి రైతన్న రెడీ..!



అనపర్తిలో తయారు చేసిన రబీ నారుమడి



పెదపూడిలో నారుమడి తయారు చేస్తున్న ట్రాక్టర్

- అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో 85 శాతం మాసూళ్లు పూర్తి
- నారుమళ్లకు సన్నద్ధం
- 57,442 ఎకరాల్లో సాగుకు సిద్ధం

పెదపూడి: ఖరీఫ్ మసూళ్ల పనులు దాదాపు పూర్తి కావడంతో అన్నదాత రబీ పనులకు సన్నద్ధమవుతున్నాడు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతన్నలకు వరుణుడు కొంత ఇబ్బంది కలిగించాడు. అయినప్పటికి మసూళ్ల సమయంలో ప్రకృతి సహకరించడంతో పనులు పూర్తవుతున్నాయి. ఈ సీజన్‌లో వరిపంట ఆశాజనకంగా ఉంది. ఎకరాకు 36 నుంచి 38 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ఈ నేపథ్యంలో ముందుగా వరికోతలు కోసిన పొలాల్లో నారుమడుల తయారీలో రైతులు బిజీగా ఉన్నారు. బోర్లు, పెద్ద కాల్వల సమీపంలో ఉన్న పొలాల్లో రైతులు నారుమడుల తయారీలో నిమగ్నమయ్యారు. ఈ పొలాలకు నీటిని మళ్లించి ట్రాక్టర్లతో దమ్ములు చేస్తున్నారు. కొందరు మెరక పొలాల రైతులు యంత్రాలతో సాగు చేసేందుకు ట్రేలలో వరి నారుమడులు పోస్తున్నారు.

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో మొత్తం ఏడు మండలాల్లో 57,442 ఎకరాల్లో రబీ సీజన్‌లో రైతులు వరిసాగు చేస్తున్నారు. అనపర్తిలో 12వేలు, పెదపూడిలో 18వేలు, రంగంపేటలో 2వేలు, బిక్కవోలులో 13వేలు, కోరుకొండలో 2వేలు, సీతానగరంలో 1917 ఎకరాలు, రాజానగరంలో 8,060 ఎకరాల్లో రబీలో వరి సాగు చేయాడానికి అన్నదాతలు సిద్ధమయ్యారు.

విత్తనాల రకాలు ఇవే

ఈ రబీ సీజన్లో ఎంసీ 13, ఎంటీయూ 3626, ఎంటీయూ 1121, ఎంటీయూ 1156, ఎంటీయూ 1153 రకాలను సుమారు 80 శాతం మంది రైతులు సాగు చేయనున్నారు. మిగిలిన 20 శాతంలో స్వర్ణ రకం సాగు చేయనున్నారు. ఆర్‌పీ బయో 226, ఇంకా బోండాలు, ప్రైవేటు వరి రకాలు రైతులు సాగు చేయవచ్చని ఆయా మండలాల వ్యవసాయశాఖ అధికారులు అభిప్రాయం. అయితే తల్లి విత్తనం (ఫౌండేషన్ సీడ్స్)నుంచి సేకరించిన విత్తనాన్ని వాడటంతో పంట అంతా ఒకేలా ఉంటుంది.

లైసెన్స్ దుకాణాలే మేలు

కొందరు రైతులు నేరుగా విత్తనాలు సాగు చేసుకుని నిల్వ చేసుకుంటున్నారు. వారి వద్ద నుంచి మిగిలిన రైతులు కొనుగోలు చేస్తున్నారు. ఎంపిక చేసుకున్న విత్తనాల్లో మరే ఇతర వరి విత్తనాలు కలవకుండా చూసుకోవాలి. మార్కెట్‌లోని లైసెన్స్ దుకాణాల వద్ద విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని రైతులు కొనుగోలు చేసి నారుమడులు పోసే పనిలో నిమగ్నమైయ్యారు. 30 కిలోల విత్తనాల ప్యాకెట్ ధర ఆయా రకాల ప్రకారం రూ.1050 నుంచి రూ.1200 వరకు పలుకుతోంది. దుకాణాల వద్ద విత్తనాలను కొనుగోలు చేసే రైతులు బిల్లులను, సంచులను పంటకాలం పూర్తి అయ్యే వరకు జాగ్రత్త పెట్టుకోవాలి. కాకినాడలోని ఏపీ సీడ్స్‌లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. త్వరలో సొసైటీల్లో కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి



ఎక్కువ మొలక శాతం కలిగిన విత్తనాలను రైతులు ఎంపిక చేసుకోవాలి. లైసెన్స్ పొందిన షాపుల వద్ద మాత్రమే కొనుగోలు చేసుకోవాలి. కాకినాడలోని ఏపీ సీడ్స్‌లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. మండలంలో సుమారు 80శాతం వరి మసూళ్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం డీఏపీ, యూరియా ఎరువులు అవసరం మేరకు అందుబాటులో ఉన్నాయి.

టీవీఆర్.మణిదీప్, మండల వ్యవసాయాధికారి, పెదపూడి

బెల్లం ఊట ధ్వంసం



ములకల్లంకలో సారా బట్టీలో డ్రమ్ములు, కట్టెలను కాల్చి వేస్తున్న సీఐ సత్యకిషోర్, ఎస్సై రామ్‌కుమార్

సీతానగరం: ములకల్లంక లంక భూముల్లో సారా బట్టీలపై కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేసి 1,200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. మంగళవారం జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు నార్త్ జోన్ ఇన్‌చార్జ్ డీఎస్పీ జి.దేవకుమార్ పర్యవేక్షణలో కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్య కిషోర్, ఎస్సై డి.రామ్‌కుమార్, సీతానగరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో బొబ్బిల్లంక నుంచి పడవపై ములకల్లంక లంక భూముల వద్దకు చేరుకున్నారు. డ్రోన్ల సహాయంతో సారా బట్టీలను గుర్తించారు. గోదావరి పాయను ఆనుకుని డ్రమ్ముల్లో పులిసిన బెల్లం ఊట గుర్తించి, వాటిని ధ్వంసం చేశారు. అక్కడ నాలుగు సారా బట్టీలను ధ్వంసం చేశారు. సీఐ సత్యకిషోర్ మాట్లాడుతూ డ్రోన్ల సహాయంతో సారా బట్టీల వద్ద ఉన్నవారిని గుర్తించామని, వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వీటిపై కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నంబర్ 94409 04829, సీతానగరం ఎస్సై నంబర్ 94409 04832కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, తెలిపిన వ్యక్తులకు తగిన పారితోషికం ఇస్తామని సీఐ తెలిపారు.

'నన్నయ'లో రాజ్యాంగ దినోత్సవం



నన్నయ వర్సిటీలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు

రాజానగరం: భారత రాజ్యాంగం ద్వారా దేశానికి గణతంత్ర ప్రతిపత్తి వచ్చిందని, దాని గౌరవిస్తూ వాటి ఫలాలను భావితరాలకు అందించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. యూనివర్సిటీలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించారు. సెంట్రల్ లైబ్రరీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి, సమావేశంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వివక్ష లేని సమాజం కోసం అంబేడ్కర్ ఎనలేని కృషి చేశారన్నారు. భారత రాజ్యాంగంలోని వివిధ అంశాలు, ప్రాధాన్యతలపై పొలిటికల్ సైన్స్ విద్యార్థులు ఉపన్యసించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. వివిధ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

- గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ మాట్లాడుతూ భారత రాజ్యాంగం విశిష్టత, ఔన్నత్యాన్ని వివరించారు. డీన్ బి. శ్రీనివాసరాజు, ఎస్ఎస్ఎస్ పీఓ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే దివాన్‌చెరువులోని వీజేస్ ఫార్మసీలోనూ రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

సీతానగరం: సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఇన్‌చార్జ్ హెచ్ఎమ్ కన్నూరి సతీష్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. పీడీలు సింహాద్రి, శంకర్‌రావు, ఉపాధ్యాయులు బ్రహ్మాజీ, ఉమాదేవి, తమ్మయ్య, ముస్తఫా, పుష్ప సరళ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం



బిక్కవోలులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఉద్యోగులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, రాజ్యాంగం ఆవశ్యకతను వివరించారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు వెంకటేష్ భారత రాజ్యాంగంలో కల్పించిన ప్రాథమిక హక్కుల గురించి తెలిపారు. అధ్యాపకులు డీవీ నాగేశ్వరరావు, వీవీ సుబ్బారావు, డాక్టర్ మాధవ్, ఎ.వాణి, ఎస్.మీనాక్షి, కె.దుర్గాప్రసాద్, వై.ఫణీంద్ర కుమార్, ఎం.అలేఖ్య తదితరులు పాల్గొన్నారు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాల హెచ్ఎం పళ్లా వీర ప్రభాకర్‌రావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచ దేశాల్లోనే అతి పెద్దదని గుర్తు చేశారు. రాజ్యాంగ నిర్మాతగా అంబేడ్కర్ అన్ని వర్గాలకు సంపూర్ణ న్యాయం చేశారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకే రాజ్యాంగ అవతరణ

రంగంపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతో సంక్రమించిన హక్కులను ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవాలని తహసీల్దార్ యు.రంజిత్‌కుమార్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక న్యాయం, సాధికారతను సాధించడానికి భారత రాజ్యాంగం దోహదపడుతుందని ఎంపీడీఓ సాయిబాబు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. అంతకుముందు ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ పి.వెంకటరత్నం, ఎంపీపీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెదపూడి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో అంతా నడవాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులంతా ప్రతిజ్ఞ చేశారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రపంచ ప్రజాస్వామిక దేశాలలో భారత రాజ్యాంగం అతిపెద్ద రాజ్యాంగమన్నారు. భారత రాజ్యాంగం భారతీయులకు పవిత్ర గ్రంథం లాంటిదన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్‌రావు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎం.శ్రీనివాసు, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ స్వామి, ఎంఈఓ-1,2లు కె.సత్యనారాయణ, సీవీవీ.సత్యనారాయణ, వెలుగు ఏపీఎం చిన బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మధురపూడి: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోరుకొండలో పంచాయతీ సెక్రటరీ రమేష్ బాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తొలుత పంచాయతీ కార్యాలయంలో ఉద్యోగులంతా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం దేశానికి దిక్సూచి అన్నారు. బూరుగుపూడి పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీ తాతపూడి జాకబ్‌రాజు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.



సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిట్టిబాబు



రంగంపేట ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు



పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

న్యూట్రీ గార్డెన్‌తో ఎంతో మేలు



కాటవరంలో మొక్కలు నాటే కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

సీతానగరం: కాటవరం అంగన్‌వాడీ సెంటర్-2 వద్ద అంగన్‌వాడీ కార్యకర్త నాగదుర్గ ఆధ్వర్యంలో న్యూట్రీ గార్డెన్‌లో ఆకుకూరలతో పాటు పలు రకాల కూరగాయల మొక్కలు వేశారు. మంగళవారం సర్పంచ్ గొంతెన సత్యవేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరా భారతి, గ్రామ పెద్ద చిట్టూరి రంగారావు తదితరుల సమక్షంలో ఆకుకూరలు, దుంప జాతి, తీగజాతి, పలు రకాలైన కూరగాయల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సూపర్‌జర్ ఇందిరాభారతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో న్యూట్రీ గార్డెన్‌లో మొక్కలు పెంచుతున్నామన్నారు. ఇది ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ మోడల్ మేకర్ దుర్గ, శ్రీనివాస్, గ్రామస్తులు దాసరి కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మమత, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య షష్ఠికి ఏర్పాట్లు



కోరుకొండలో షష్ఠి మహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

మధురపూడి: కోరుకొండలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్ఠి మహోత్సవాలు డిసెంబరు 7వ తేదీ నుంచి 12 వరకూ నిర్వహించనున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వుల్లి బుజ్జిబాబు అన్నారు. మంగళవారం కోరుకొండ స్వామివారి కల్యాణ మండపంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. 7న రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. కమిటీ జాయింట్ సెక్రటరీ తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ బస్టాండ్ సెంటర్ వర్తక సంఘం, భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా 11న 108 మంది దంపతులచే శాంతి కల్యాణం నిర్వహిస్తారన్నారు. ఆ సందర్భంగా తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు దంపతులచే ప్రసాద కైంకర్యం జరుగుతోందన్నారు. 12న స్వామివారి గ్రామోత్సవం ఉంటుందన్నారు. అలాగే స్వామి కల్యాణ మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షుడు బదిరెడ్డి దొర, సభ్యులు నీరుకొండ బాబ్జి, కోశాధికారి కటకం సత్యనారాయణ, సభ్యులు పసుపులేటి అబ్బులు, కటకం చలం, కేతినీడి ఆశోక్, వుల్లి కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దోమాడలో పొలంబడి



మాట్లాడుతున్న కాకినాడ జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్

పెదపూడి: తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి సాధించే విధంగా రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి ఇండిగ్యాప్ పొలంబడి కార్యక్రమం దోహద పడుతుందని కాకినాడ జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయకుమార్ అన్నారు. దోమాడ గ్రామంలో ఇండిగ్యాప్ పొలంబడి క్షేత్ర దినోత్సవం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్.విజయకుమార్, వ్యవసాయ సహాయ సంచాలకులు రత్న ప్రశాంతి, మండల వ్యవసాయాధికారి టీవీఆర్.మణిదీప్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటను ప్రభుత్వం రైతు ఉత్పాదక సంఘాల ద్వారా మద్దతు ధరకు మించి కొనుగోలు చేస్తారన్నారు. రైతులు ముందస్తుగా రబీసాగు సాగు చేపట్టాలన్నారు. మూడో పంటగా అపరాలు సాగు చేయాలని సూచించారు. దోమాడ రైస్ అనే బ్రాండ్‌తో రైతులు వారు పండించిన పంటను నేరుగా విక్రయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలకు అడ్డేదీ?

- రోడ్డుపైనే ఇళ్ల నిర్మాణాలు
- పట్టించుకునే వారే కరవు



రాజానగరం అగ్రహారంలో పీహెచ్‌సీ పక్కన సీసీ రోడ్డుపై పిల్లర్లు వేసి, ఓ ఇంటి నిర్మాణం

రాజానగరం: నియోజకవర్గ కేంద్రం రాజానగరంలో ఆక్రమణలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అధికార పార్టీ అండదండలతో ఆక్రమణల జోరు పెరిగింది. గ్రామంలో సుమారు కిలోమీటరు వరకూ ఉన్న పాత జాతీయ రహదారికి ఇరువైపులా లక్ష్మణ రేఖలా సీసీ మేజర్ డ్రైన్ ఉంది. దీనిని దాటి ఎవరూ రోడ్డు మీదకు వ్యాపారాలు గానీ, ఇల్లు, దుకాణాల నిర్మాణాలు చేయరాదని గతంలో నిబంధన ఉండేది. దానిని చాలామంది అధికారులు (పోలీసు బాస్‌లు కూడా) సైతం అమలు చేశారు. కానీ నేడు ఆ లక్ష్మణ రేఖను పట్టించుకునేవారే లేరు. వ్యాపారులు ఇష్టారాజ్యంగా రోడ్డుపైకి వచ్చి తమ వ్యాపారాలను విస్తరించుకుంటున్నారు. ఈ క్రమంలో అన్నదాన సత్రం నుంచి గాంధీ బొమ్మ, మార్కెట్ ఏరియా, బస్టాండ్ సెంటరు మీదుగా సాయిబాబా గుడి సెంటరు వరకూ ఆక్రమణలు రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయాయి. దీనితో ఈ ప్రాంతాల్లో తరచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడి, రెండు బస్సులు ఎదురుపడితే తప్పుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుంది. ఈ సమయంలో బైక్‌లపై వెళ్లేవారి ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.

వదిలేయడం వల్లే..

రహదారిని ఆక్రమించుకుని వ్యాపారాలు చేయగా లేనిది, ఇళ్లు కట్టుకుంటే తప్పేమిటి?.. అనుకున్నారో ఏమో గానీ, కొందరు తమంది రాజానగరంలో రోడ్లపైనే ఇళ్ల నిర్మాణాలు చేసేస్తున్నారు. కాలనీల్లో రోడ్లను కలుపుకొని నిర్మాణాలు జరుగుతుంటే.. అగ్రహారంలో ఏకంగా రోడ్డుపైనే ఇల్లు నిర్మిస్తున్నా సంబంధిత అధికారులకు కనిపించకపోవడం విచారకరం. నిరంతరం ప్రజల బాగోగులు, గ్రామంలో సమస్యలు, అభివృద్ధి పనులు పర్యవేక్షించాల్సిన పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. పేరుకు నియోజకవర్గ కేంద్రంగా ఉన్నా గానీ ఏ మండల అధికారీ ఈ గ్రామం వైపు కన్నెత్తి చూడరు. అసలు ఈ గ్రామంతో తమకు పని లేదన్నట్టుగా వ్యవహరించడం వలనే ఇన్ని సమస్యలు వస్తున్నాయనేది వాస్తవం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.